ట్రాఫిక్ గందరగోళం

- ఆశీలమెట్ట సబ్‌వేలో దూసుకెళ్తున్న వాహనాలు
- ఇష్టానుసారంగా రాకపోకలతో ప్రమాదాలు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



ఆశీలమెట్ట సబ్‌వే మార్గంలో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహన చోదకులు

సీతమ్మధార: మూడు పోలీస్ స్టేషన్ల సరిహద్దుగా గల ఆశీలమెట్ట సబ్‌వే మార్గంలో ట్రాఫిక్ మళ్లీ గందరగోళంగా తయారైందని ఆందోళన వ్యక్తమవుతోంది. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి ఆశీలమెట్ట జోన్‌-3 ఆఫీస్ వరకు ఈ సబ్ వే మార్గం విస్తరించి ఉంది. టూ టౌన్, త్రీ టౌన్, ద్వారకా జోన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న ఈ సబ్‌వే మార్గంలో మొదట్లో సిటీ బస్సులు రాకపోకలు సాగించేవి. రెండు వైపులా ట్రాఫిక్ అనుమతించేవారు. అప్పట్లో డివైడర్లు ఉండేవి. తరువాత ఎందుకనో వాటిని తొలగించి ఫుట్‌పాత్‌కు తరలించిన తరువాత మూడు ప్రమాదాలు జరిగాయి. ఇవన్నీ ఆర్టీసీ బస్సుల కారణంగానే జరగడం గమనార్హం. ఈ ప్రమాదాల్లో ముగ్గురు వాహన చోదకులు మరణించారు. దీంతో ద్వారకా పోలీసులు ఈ సబ్‌వే మార్గాన్ని వన్‌వేగా మార్చారు. రామాటాకీస్ నుంచి జీవీఎంసీ కార్యాలయం మీదుగా పాత జైలురోడ్డు వైపు మాత్రమే వాహనాలు అనుమతిస్తున్నారు. సిటీ బస్సులను ఆశీలమెట్ట సిగ్నల్స్ వైపు రూటు మార్చారు.

స్తంభిస్తున్న ట్రాఫిక్

రెండు నెలలుగా ఈ సబ్‌వే మార్గంలో ఇరువైపులా మళ్లీ వాహనాలను అనుమతించడంతో ట్రాఫిక్ గందరగోళంగా తయారైంది. ఆశీలమెట్ట జోనల్ కార్యాలయం ఎదుట వాహన చోదకులు యూ టర్న్ తీసుకునే క్రమంలో ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించి పోతోంది. ఈ సమయంలో వాహన చోదకులు సహనం నశించి బండి హారన్లు మోగించడంతో ఈ ప్రాంతమంతా శబ్ద కాలుష్యంతో నిండిపోతోందని స్థానికులు హడలిపోతున్నారు. దీంతో ఇక్కడ యూ టర్న్ మూసివేయాలని పలువురు సూచిస్తున్నారు.

వాయువేగంతో ఓవర్‌టేక్

గతంలో పోలీస్ కమిషనర్ మహేష్‌చంద్ర లడ్డా హయాంలో సబ్‌వే మార్గాన్ని పరిశీలించి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. కాలక్రమేణా సబ్‌వే మార్గం గురించి పోలీసు ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం వల్లే నిత్యం ట్రాఫిక్ గందరగోళంగా ఉంటోందని పలువురు అంటున్నారు. వాస్తవానికి ఈ మార్గంలో వాహనాలు తమ ముందు వాహనాన్ని ఓవర్‌టేక్ చేయకూడదు. ఈ నిబంధనను మీరి పలువురు యువకులు ఇష్టానుసారంగా వాయువేగంతో దూసుకెళ్తున్నారు. లైన్ క్రాస్ చేసి మరీ ముందు వాహనాలను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న వాహన చోదకులను హడలెత్తిస్తున్నారు. ఇక్కడ సిమెంట్ డివైడర్లకు బదులుగా ప్లాస్టిక్ స్టిక్స్ మాత్రమే వాడటం విమర్శలకు తావిస్తోంది. డివైడర్లు రోడ్డు పొడుగునా కాకుండా సబ్‌వే మధ్యలో మాత్రమే ఏర్పాటు చేయడం గమనార్హం. త్రీటౌన్, ద్వారకా, త్రీ టౌన్ ట్రాఫిక్ పోలీసులు స్పందించి సబ్‌వే మార్గంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరించే దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

ప్రశాంతంగా స్కూల్ కమిటీ ఎన్నికలు



మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో ఎన్నికైన కొత్త కమిటీ సభ్యులు



ఎస్‌ఎంసీ హైస్కూల్ పేరెంట్స్ కమిటీ నూతన కార్యవర్గం

సీతంపేట/సీతమ్మధార/తాటిచెట్లపాలెం/మురళీనగర్/కంచరపాలెం: ఉత్తర నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 6 నుంచి 10 వరకు తరగతికి ముగ్గురు చొప్పున 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు. 25వ వార్డు మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో కమిటీ ఎన్నికకు 280 మంది హాజరయ్యారు. కమిటీ చైర్‌పర్సన్‌గా యు.కృష్ణవేణి, వైస్ చైర్‌పర్సన్‌గా డి.జమున ఎన్నికయ్యారు. మధురానగర్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల చైర్‌పర్సన్‌గా జె.ఉష, వైస్ చైర్మన్‌గా జి.లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ కమిటీ చైర్మన్‌గా అప్పలరాజు, వైస్ చైర్‌పర్సన్‌గా బి.ఉషారాణి ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతికుమారి, దేముడుబాబు, లక్ష్మీనరస, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

- పీఅండ్‌టీ కాలనీలోని నెహ్రూ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో హెచ్‌ఎం డి.రామ్‌ప్రసాద్ పర్యవేక్షణలో పేరెంట్స్‌కమిటీ ఎన్నికలు నిర్వహించారు. కమిటీ చైర్‌పర్సన్‌గా మీసాల ఇందిర, వైస్ చైర్‌పర్సన్‌గా పోతల రుతి ఎన్నికయ్యారు. నూతన సభ్యులను హెచ్‌ఎం రామ్‌ప్రసాద్ అభినందించి వారి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, కరుణాకర్, బెండి ప్రసాద్, హెనా, ఇ.వరలక్ష్మి, నాగభూషణం, ఆర్.జి.ప్రభావతి, త్రినాధమూర్తి, స్వర్ణకుమారి, పుష్ప, శ్రీదేవి, సుజాత, ప్రభావతి, వరలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.
- 42వ వార్డు రైల్వే న్యూకాలనీ జీవీఎంసీ హైస్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్‌గా ఎస్.రామారావు, వైస్ చైరపర్సన్‌గా డి.యశోదతోపాటు సభ్యులు ఎంపికయ్యారు. వారిని పాఠశాల హెచ్‌ఎం సన్యాసిరావు అభినందించారు.
- మాధవధార జీవీఎంసీ హైస్కూల్‌లో హెచ్‌ఎం బి.హేమలత అధ్యక్షతన నిర్వహించిన పేరెంట్స్ కమిటీ ఎన్నికల్లో చైర్మన్‌గా బి.క్రిస్టినా, వైస్ చైర్మన్‌గా వై.పి.కె.నాయుడు ఎన్నికయ్యారు. కె.కాలనీ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్‌గా కె.అరుణ, వైస్ చైర్మన్‌గా ఆర్ త్రినాథ్ ఎన్నికయ్యారని హెచ్‌ఎం ఎస్ఎస్ఎం సాయిలక్ష్మి తెలిపారు. మాధవధార జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం ఎస్.పి.నాయుడు అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికల్లో చైర్మన్‌గా బి.గోపాలకృష్ణ, వైస్ చైర్‌పర్సన్‌గా కె.లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- జీవీఎంసీ 54, 55, 56, 57 వార్డుల్లోని ఆర్పీ పేట, తిక్కవానిపాలెం, ధర్మానగర్, కంచరపాలెం, సుభాష్‌నగర్, కప్పరాడ పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలు సజావుగా నిర్వహించారు. చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తెలిపారు. నార్త్ ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, కంచరపాలెం సీఐ భాస్కర్‌రావు, ఎస్ఐ రవికుమార్ ఎన్నికలను పర్యవేక్షించారు. ఎన్నికైన సభ్యులచే ప్రమాణ స్వీకారాలు చేయించారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు



ప్రత్యేక అలంకరణలో పర్వత వర్ధిని అమ్మవారు

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవస్థానంలో కొలువైన పర్వత వర్ధిని అమ్మవారికి తొలి శ్రావణ గురువారం పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని గాజులు, పలు రకాల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు పలు రకాల నైవేద్యాలు సమర్పించారు. ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తెచ్చిన పసుపు, కుంకుమ, గాజులను అమ్మవారికి సమర్పించారు. మహాలక్ష్మి దుర్గమ్మ వారికి శ్రావణ మాసం సందర్భంగా కుంకుమ పూజలు చేశారు. శ్రావణ పూజల సందర్భంగా దేవస్థానం పరిసర ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది వనజ, శివ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక ఆలయ వార్షికోత్సవం



ప్రసన్న వినాయకుడిని దర్శించుకుంటున్న అతిథులు, కమిటీ సభ్యులు

కంచరపాలెం: జాషువానగర్‌లోని ప్రసన్న వినాయక ఆలయ 26వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకుడు వరహర గిరిశర్మ, ముఖ్య అతిథి మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, రాజు సప్లయర్స్ అధినేత టి.ఎస్.ఎన్.రాజు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని జరిపారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. స్థానిక నాయకులు ఈతలపాక విజయలక్ష్మి, వెదుళ్ల పార్వతి, శీరపు శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్వరరావు గణపతిని దర్శించుకున్నారు. జాషువా కళా ప్రాంగణం గౌరవ అధ్యక్షుడు గొటివాడ నర్సింగరావు, అధ్యక్షుడు అలమండ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గుమ్మిడి ఆదినారాయణమూర్తి, కోశాధికారి గుమ్మిడి అచ్చిబాబు, జి.వి.రమణ, గుమ్మిడి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జోడుగుళ్లపాలెంలో వెన్నెల కిషోర్ సందడి



లొకేషన్‌లో నటుడు వెన్నెల కిషోర్

కొమ్మాది: బీచ్ రోడ్డు జోడుగుళ్ల పాలెంలో గురువారం షూటింగ్ సందడి నెలకొంది. నటులు వెన్నెల కిషోర్, ప్రియదర్శిపై పలు సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. గత వారం రోజుల నుంచి విశాఖ – భీమిలి బీచ్ రోడ్డు ప్రాంతాల్లో శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మాణంలో శ్రీదేవి మూవీస్ పతాకంపై దర్శకుడు ఇంద్రగంటి మోహన్‌కృష్ణ తెరకెక్కిస్తున్న ఓ సినిమాకు సంబంధించిన సన్నివేశాలు చిత్రీకరించారు. హీరోయిన్‌గా రూప కొడువాయూర్ నటిస్తున్న సంగతి తెలిసిందే. గురువారంతో ఈ సినిమా షూటింగ్ పూర్తయినట్లు చిత్ర యూనిట్ తెలిపింది.

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం

- పోలీస్ కమిషనర్ శంఖబత్ర బాగ్చి
- ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబత్ర బాగ్చి

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌ను గురువారం నగర పోలీస్ కమిషనర్ శంఖబత్ర బాగ్చి సందర్శించారు. కంచరపాలెం పీఎస్ పరిధిలో పలు కేసులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని సిబ్బందికి సీపీ సూచించారు. స్టేషన్ ఆవరణ, పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

క్రైం సిబ్బంది విధులపై అసంతృప్తి

అనంతరం అదే పోలీస్ స్టేషన్‌లో మేడపైన ఉన్న కంచరపాలెం, ఎయిర్‌పోర్టు క్రైం స్టేషన్లను పోలీస్ కమిషనర్ సందర్శించారు. జీడీ ఎంట్రీ బుక్‌ను పరిశీలించిన ఆయన పుస్తకంలో ఎందుకు వారి వారి ఎంట్రీలను నిర్వహిండం లేదని, వారి కదలికలను ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. ఎయిర్‌పోర్టు క్రైం స్టేషన్‌లో సిబ్బంది లేకపోవడంతో అక్కడ నుంచే క్రైం డీసీపీ వెంకటరత్నంతో ఫోన్‌లో సీపీ మాట్లాడారు. పలు విషయాలు అడిగి తెలుసుకుని అసంతృప్తి వ్యక్తం చేశారు. క్రైం అధికారులు, సిబ్బంది ఏ సమయానికి వస్తున్నారు, ఏ సమయానికి వెళ్తున్నారో కూడా నమోదు చేయకపోవడంతో వారిపై సీపీ అసహనం వ్యక్తం చేశారు. క్రైం విభాగంలో విధులు నిర్వర్తించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని, పైఅధికారుల నుంచి సిబ్బంది వరకు చీవాట్లు పెట్టారు. సీఐ ఎస్.భాస్కరరావు, ఎస్ఐ రవికుమార్, క్రైం ఎస్ఐ ప్రకాషరావు, ఏఎస్ఐ సతీష్ ,సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సీతమ్మధార: పీఅండ్‌టీ కాలనీ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్టు కొమ్మల ట్రిమ్మింగ్ నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్‌-1 ఈఈ బి.సింహాచలం నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం ఏరియా, రసపూర్ణ ఏరియా, సునీత నర్సింగ్ హోమ్, పోస్టాఫీసు, సత్యం జంక్షన్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మర్రిపాలెం సెక్షన్‌లో..

మురళీనగర్: జోన్‌-2 డివిజన్ మర్రిపాలెం సెక్షన్ పరిధి హ్యాపీ హోమ్స్, 104 ఏరియా 11 కేవీ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్‌-2 ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు హ్యాపీ హోమ్స్, ఐటీఐ కూడలి, 104 ఏరియా, శ్యామ్‌నగర్ కాలనీ, రాము నాయుడు కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

మురళీనగర్ సెక్షన్‌లో..

మురళీనగర్ సెక్షన్‌లోని పట్టాభిరెడ్డి గార్డెన్స్ 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పట్టాభిరెడ్డి గార్డెన్స్, ఎన్జీజీవోస్ కాలనీ, హనుమాన్ ఆలయ ప్రాంతం, రామాలయ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

సీతమ్మధార రైతుబజార్‌కు శ్రావణ శోభ



సీతమ్మధార రైతుబజారులో పువ్వులు కొనుగోలు చేస్తున్న మహిళలు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్ వినియోగదారులతో కిటకిటలాడింది. తొలి శ్రావణ గురువారం కావడంతో ఉదయం నుంచే అధిక సంఖ్యలో మహిళలు రైతుబజార్‌కు వచ్చి చామంతి, బంతి, గులాబీ మొదలగు పువ్వులు కొనుగోలు చేశారు. బజారులో గురువారం కిలో చామంతి(హైబ్రిడ్) రూ.400, బంతి రూ.150, గులాబీ రూ.250, ఆరెంజ్ బంతి రూ.35, పసుపుబంతి దండలు రూ.40 చొప్పున విక్రయించారు. మల్లిపూలు మూర రూ.80, జాజి పూలు మూర రూ.50, కనకాంబరాలు మూర రూ.90, కాగడాలు మూర రూ.50 వంతులు అమ్మకాలు సాగించారు. మల్లి, బంతి దండలు ఎక్కువ పరిమాణంలో విక్రయించడం కనిపించింది. రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్ వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు. గత నెలతో పోలిస్తే పువ్వుల ధరలు స్వల్పంగా పెరిగాయని సిబ్బంది తెలిపారు.

దేశ ఆర్థికాభివృద్ధిలో మత్స్యకారుల పాత్ర కీలకం



ఏయూ విద్యా విభాగాధిపతి షారోన్ రాజు

విశాఖ సిటీ: దేశ ఆర్థికాభివృద్ధిలో మత్స్యకారులు, మత్స్య అనుబంధ పరిశ్రమల పాత్ర కీలకమని ఏయూ విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్‌రాజు అన్నారు. ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా, పశు సంవర్థక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పోర్ట్ బ్లెయిర్‌లోని జోనల్ కార్యాలయంలో గురువారం మత్స్యకారులకు అవగాహన సదస్సు జరిగింది. రిసోర్స్‌పర్సన్‌గా పాల్గొన్న ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ దేశానికి తీర ప్రాంతం అతిపెద్ద ఆర్థిక వనరుగా నిలుస్తోందన్నారు. ఇది ప్రత్యక్షంగా మత్స్యకారులకు ఉపాధిని కల్పించడంతో పాటు, పరోక్షంగా అనుబంధ పరిశ్రమలకు స్థానం కల్పిస్తోందని వివరించారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా ఈ రంగాన్ని పటిష్టం చేయడం ఎంతో అవసరమన్నారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని, నిపుణుల సూచనలను ఎప్పటికప్పుడు వినియోగించుకుంటూ వేట సాగించాలని సూచించారు. అనంతరం నిర్వాహకులు ఆచార్య షారోన్ రాజును సత్కరించారు.

సేవలోనే సంతృప్తి



సీతమ్మధార పాపా హోమ్‌లో పిల్లలకు భోజనాలు వడ్డిస్తున్న ధర్మాల ఆనంద్‌కుమార్‌రెడ్డి

సీతమ్మధార: సామాజిక సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి లభిస్తుందని ధర్మాల ఫౌండేషన్ అధ్యక్షుడు ధర్మాల ఆనంద్‌కుమార్‌రెడ్డి అన్నారు. డి.ఎల్.రెడ్డి వర్ధంతి సందర్భంగా డి.ఎల్.రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, ద్వారకానగర్ ప్రాంతాల్లోని పేదలకు బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సీతమ్మధార పాపా హోమ్‌లో విద్యార్థులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక రంగంలో కార్మిక నాయకుడిగా డి.ఎల్.రెడ్డి విశేష సేవలు అందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కృష్ణకాంత్‌రెడ్డి, జానకీరామ్, జైకుమార్, ప్రసాదరెడ్డి తదితరులు పాపా హోమ్ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు వితరణ

కంచరపాలెం: డి.ఎల్.రెడ్డి వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు, డి.ఎల్.రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ధర్మాల ఆనంద్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కప్పరాడ, కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్, తాటిచెట్లపాలెం, జ్ఞానాపురం రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో పేదలకు దుప్పట్లు, రగ్గులు, అల్పాహారం పంపిణీ చేశారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్స్, ఉచితంగా పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే యువకుడి మృతి?

ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యుల ఆందోళన



ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

సీతంపేట: వైద్యులు సరైన చికిత్స అందించకపోవడం వల్లే బీటెక్ చదువుతున్న తన కొడుకు మృతి చెందాడని యువకుడి తండ్రి రమణారెడ్డి ఆరోపిస్తూ, బంధువులతో కలిసి గురువారం అక్కయ్యపాలెంలోని లక్ష్మీగాయత్రి ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కొడుకు ధనుష్‌రెడ్డి(21) హైఫీవర్‌తో ఇచ్ఛాపురం నుంచి తీసుకువచ్చి జూలై 19న లక్ష్మీగాయత్రి ఆస్పత్రిలో చేర్పించామన్నారు. అవసరమైన వైద్య పరీక్షలు, సరైన చికిత్స చేయకపోవడం వల్ల తన కొడుకు మరణించాడని, ఆస్పత్రి వైద్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దీనిపై ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ కె.వి.రామ్‌కుమార్ వివరణ కోరగా.. హైఫీవర్, కడుపు నొప్పితో మా ఆస్పత్రిలో జాయిన్ చేసిన 12 గంటల్లో ఫీవర్, కడుపు నొప్పి తగ్గించామన్నారు. ఆ తర్వాత పేషెంట్ యాపిల్ పండు తిన్నాడని, కొద్దిసేపటి తర్వాత ఆయాసం రావడంతో ఈసీజీ, ఊపిరితిత్తులకు పరీక్షలు చేయగా నార్మల్‌గా ఉన్నట్టు తేలిందన్నారు. చికిత్స చేసినప్పటికీ ఆయాసం తగ్గక పోవడంతో ఎక్విప్‌మెంట్ ఉన్న పెద్ద ఆస్పత్రికి రిఫర్ చేశామని, తమ ఆస్పత్రిలో అందించిన చికిత్సలో లోపం లేదని పేర్కొన్నారు.

నిరుపయోగంగా డస్ట్‌బిన్లు



సీతమ్మధార రైతుబజారు పక్కన గోనె సంచులు కప్పి ఉన్న డస్ట్‌బిన్లు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారు పక్కన తడి, పొడి చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. గతంలో రైతుబజారులోని చెత్త, పక్కనే ఉన్న చేపలు, కూరగాయల మార్కెట్‌లోని చెత్త, వ్యర్థాలను ఈ డస్ట్‌బిన్లలోనే వేసేవారు. కొద్ది నెలలుగా డస్ట్‌బిన్లపై గోనె సంచులు వేసి ఉన్నాయి. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పరిశీలించి తక్షణమే తడి చెత్త – పొడి చెత్త డస్ట్‌బిన్లు వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

సందర్శకులకు అనుకూలంగా వాకర్స్ పార్కు



సత్యనాథం, బుచ్చయ్య, రామకృష్ణారెడ్డిలను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు



వాకర్స్ పార్కులో మొక్కలు నాటుతున్న పల్లా చంద్రమౌళి, క్లబ్ సభ్యులు

మురళీనగర్: వాకర్స్ పార్కును సందర్శకులకు అనుకూలంగా మార్చేందుకు వాకర్స్ క్లబ్ సభ్యులు కృషి చేయాలని క్లబ్ పూర్వ అధ్యక్షుడు నిమ్మగడ్డ బుచ్చయ్య పిలుపునిచ్చారు. వాకర్స్ క్లబ్ వార్షికోత్సవాన్ని క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ-ప్రజా భాగస్వామ్యంతో నగరంలోనే మొట్టమొది సారిగా ఏర్పడిన పార్కుగా వాకర్స్ పార్కుకు గుర్తింపు ఉన్నట్లు చెప్పారు. పూర్వ అధ్యక్షుల సలహాలు, సూచనలు, వారి సహకారంతో పార్కును నగరంలోనే ఆదర్శవంతమైన పార్కుగా తయారు చేశామన్నారు. వాకర్స్ వాయిస్ పత్రికను బుచ్చయ్య ఆవిష్కరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథం నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పూర్వ అధ్యక్షులను సత్కరించారు. ఈ నెలలో పుట్టినరోజు జరుపుకుంటున్న సభ్యులకు చిరుకానుకలు అందించారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షులు కేజీ కృష్ణారావు, సత్తి సునీల్‌రెడ్డి, ఎ.భాస్కరరావు, కె.ద్వారకానాథ్, 101–పూర్వ గవర్నరు యు.శుభ, ఎ.కృష్ణారెడ్డి, క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజు, కోశాధికారి జె.కూర్మారావు, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి, ఓం వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రమీల, సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ హితంగా పార్కు నిర్వహణ

మురళీనగర్ వాకర్స్ పార్కును పర్యావరణ హితంగా రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తెలిపారు. పార్కు 27వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం పార్కులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కులో పచ్చదనం పెంపునకు ప్రతి సభ్యుడు సహకరించాలని ఆయన కోరారు. వాకర్స్ పార్కులో 90 మొక్కలు నాటారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొని మొక్కల రక్షణకు శ్రమదానం చేశారు.

వెలమ సామాజిక వర్గానికి ప్రాధాన్యమివ్వండి



మాట్లాడుతున్న లగుడు గోవిందరావు

బీచ్‌రోడ్డు: నామినేటెడ్ పోస్టుల భర్తీలో వెలమ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బీచ్‌రోడ్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో లగుడు గోవిందరావు మాట్లాడుతూ దశాబ్దాలుగా వెలమ సామాజిక వర్గాన్ని బీ.సీ.డీ జాబితా నుంచి బీసీ–ఏ జాబితాలోకి మార్చాలని ఉద్యమాలు, పోరాటాలు చేస్తున్న తరుణంలో న్యాయం చేయాలన్నారు. వెలమ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, రైతులకు 100 సబ్సిడీతో కూడిన రుణాలు ఇవ్వాలని, సంఘానికి స్థలం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

మహిళా కళాశాలలో 'క్రియేటివ్ ఈ కంటెంట్'

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం క్రియేటివ్ ఈ కంటెంట్ కార్యక్రమం నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ డాక్టర్ పోలా భాస్కర్ నోడల్ రీసోర్స్ సెంటర్‌లోని రికార్డింగ్ స్టూడియోను ఉపయోగించుకుని నాణ్యమైన 'ఈ కంటెంట్'ను తయారు చేయాలని అధ్యాపకులకు సూచించారు. ప్రిన్సిపాల్ మంజుల మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని విద్యార్థుల్లో ఆసక్తిని రేకెత్తించేలా పాఠ్యాంశాలను రూపొందించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రీసోర్స్ పర్సన్స్‌గా డి.అరుణపద్మ, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు డాక్టర్ బి.హైమావతి, భౌతికశాస్త్ర అధ్యాపకురాలు డి.ప్రజ్ఞతో పాటు ట్రెనింగ్ క్యాంప్‌లో వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.